

నాస్‌లో సత్తా చాటాలి

నవంబర్‌లో నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో జిల్లా విద్యార్థులు సత్తా చాటాలని డీఈఓ ఆకాంక్షించారు. 10లో



..భరోసా కల్పించాలి

సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూరుతుందనే భరోసా కల్పించాలని ఎస్పీ అన్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
30° / 25°

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు జెడ్పీ చివరి సర్వసభ్య సమావేశం

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చివరి సమావేశం కావడంతో సభ్యులకు ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సింగరేణి మనుగడ కోసం బొగ్గు బ్లాక్‌లు సాధించాలి



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్, పక్కన నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కేంద్రం నిర్వహించే వేలంలో సింగరేణి సంస్థ పాల్గొన్నా, పాల్గొనకున్నా సంస్థ మనుగడ కోసం బొగ్గు బ్లాక్‌లు సాధించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ అన్నారు. కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. నిబంధనలు సవరించైనా బొగ్గు బ్లాక్‌లు తీసుకురావాలని సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని గనులను సింగరేణికి కేటాయించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి తాము ఇటీవల విన్నవించగా సానుకూలంగా స్పందించారన్నారు. ఒడిశాలోని నైనీ బ్లాక్‌ను 2015లో సింగరేణికి కేటాయించిన గత ప్రభుత్వం తీరుతో ఎలాంటి పని జరగలేదని చెప్పారు. ఈ నేపథ్యాన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం, డిప్యూటీ సీఎం నేతృత్వాన ఒడిశా సీఎంను కలవడంతో అనుమతులన్నీ వచ్చాయని తెలిపారు. కాగా, సింగరేణిలో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికలు రెండేళ్ల కాలపరిమితితోనే జరిగాయని ఆయన స్పష్టం చేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరం సింగరేణి సాధించిన ఉత్పత్తికి గాను వచ్చే లాభంలో కార్మికుల వాటాపై త్వరలో స్పష్టత వస్తుందని జనక్ ప్రసాద్ తెలిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు త్యాగరాజన్, ఆల్బర్ట్, ఎండీ.రజాక్, పీతాంబరం, ధర్మపురి, కాలం నాగభూషణం, కృష్ణంరాజు, రాజేశ్వరరావు, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి

అన్నపురెడ్డిపల్లి: వనమహోత్స లక్ష్యాలను పూర్తి చేయాలని డీఆర్‌డీఓ విద్యాచందన ఆదేశించారు. శుక్రవారం అన్నపురెడ్డిపల్లి మండలంలో గుంపెన పంచాయతీ నర్సరీని, అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను ఆమె పరిశీలించి మాట్లాడారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని , నర్సరీలోని ఖాళీ బ్యాగులను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. ఎంపీఓ షబ్నా, ఏపీఓ ప్రమీలా, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏ రంగంలో ఎక్కడున్నాం..?

తలసరి ఆదాయం రూ. 2,64,408లతో మన జిల్లా రాష్ట్రంలో ఏడో స్థానంలో నిలిచింది. పర్యాటక, రవాణా రంగాల్లో పూర్తిగా అట్టడుగుకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ తోపాటు ప్రవేశపెట్టిన సామాజిక ఆర్థిక సర్వే–2024లో ఈ విషయం వెల్లడైంది.

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



రవాణా రంగంలో లాస్ట్..

రవాణా రంగంలో రోడ్ల విషయానికి వస్తే ప్రతీ వంద చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రాష్ట్ర సాంద్రత 98.80 కి.మీ ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిస్థితి దారుణంగా ఉంది. మన జిల్లా 61 కి.మీ సాంద్రతతో 33 జిల్లాలలో అట్టడుగు నుంచి రెండోస్థానంలో నిలిచింది. ఈ పట్టికలో హైదరాబాద్ జిల్లా అగ్రస్థానంలో ఉండగా ములుగు చివరి స్థానంలో నిలిచింది. రోడ్ డెన్సిటీలో వెనకబడి ఉండటానికి దట్టమైన అడవులు, కొండ ప్రాంతాలు ఉండటం ఒక కారణమైతే రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అడ్డంకులు మరో కారణంగా చెప్పుకోవచ్చు.

తలసరి ఆదాయంలో రాష్ట్రంలో జిల్లాకు ఏడో స్థానం

- రవాణా, పర్యాటక రంగాల్లో అత్యంత వెనుకబాటు
- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలోనూ అదే తీరు
- రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడైన వాస్తవాలు

పర్యాటకంలోనూ వెనుకబాటే..

పర్యాటక రంగంలో నేలకొండపల్లి మొదలు యాదాద్రి, నాగార్జునసాగర్ మొదలు కవ్వాల్ వరకు అనేక ప్రాంతాలకు ఈసారి చోటు దక్కింది. కానీ రాష్ట్రంలో అత్యధిక అడవులు ఉండటంతోపాటు దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం, కిన్నెరసాని అభయారణ్యం, గోదావరి నది తదితర ఆకర్షణలు ఉన్నప్పటికీ సామాజిక ఆర్థిక సర్వే నివేదికలో జిల్లాకు కనీస స్థాయిలో గుర్తింపు దక్కలేదు. టెంపుల్, ఎకో టూరిజంలలో అపార అవకాశాలు ఉన్నా అందిపుచ్చుకోవడంలో వైఫల్యమే ఇందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మెరుగైన మౌలిక సదుపాయల కల్పనలో స్పష్టమైన కార్యాచరణ, పర్యాటక ప్రాంతాలపై సరైన ప్రచారం కరువైపోవడంతో ఈ రంగంలో జిల్లా వెనుకబడిందని నివేదిక స్పష్టం చేస్తోంది.

జాడలేదు

రాష్ట్రంలో 33 జిల్లాలు ఉండగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కేవలం 16 జిల్లాలకే పరిమితమయ్యాయి. ఖమ్మం జిల్లా పరిధిలో రెండు యూనిట్లు పని చేస్తున్నాయి. భద్రాద్రి జిల్లాలో ఒక్కటీ లేదు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఇల్లెందులో ఫుడ్ (పసుపు) ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసినా నిర్వహణ లోపాల కారణంగా ఆశించిన ఫలితం రాలేదు.

విద్యుత్ రంగంలో..

వ్యవసాయరంగానికి విద్యుత్ కనెక్షన్ల విషయంలోనూ భద్రాద్రి జిల్లా వెనుకబడి ఉంది. జిల్లాలో ఉన్న విద్యుత్ కనెక్షన్లలో వ్యవసాయానికి ఉపయోగిస్తున్న కరెంటు మీటర్లు కేవలం 11.80 శాతానికే పరిమితమయ్యాయి. మిగిలిన జిల్లాలతో పోల్చితే ఏజెన్సీ చట్టాల కారణంగా వేలాది ఎకరాల వ్యవసాయ భూములకు పట్టాలు లేవు. గతేడాది అటవీ హక్కుల చట్టం ప్రకారం లక్షన్నర ఎకరాలు పట్టాలు జారీ అయ్యాయి. ఈ భూములకు కూడా విద్యుత్ కనెక్షన్లు వస్తే ఈ రంగంలో భద్రాద్రి జిల్లా పరిస్థితి మెరుగుపడేందుకు ఆస్కారం ఉంది. పారిశ్రామిక రంగానికి సంబంధించిన విద్యుత్ కనెక్షన్ల విషయంలో భద్రాద్రి జిల్లా 11.60 శాతంతో మెరుగ్గానే ఉంది. మొత్తం విద్యుత్ కనెక్షన్లలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాల వాటా 23.40 శాతంగా ఉంది. మిగిలినవి గృహ కనెక్షన్లుగా ఉన్నాయి.

ఇతర కీలక అంశాలు

- జిల్లా వ్యాప్తంగా 11 అంగన్‌వాడీ ప్రాజెక్టులు ఉండగా 2,060 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఇందులో 62,149 మంది బాలింత, గర్భిణి, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. పౌష్టికాహారం అందించే విషయంలో రాష్ట్రంలో ఐదో స్థానంలో భద్రాద్రి జిల్లా నిలిచింది. విద్యా విభాగానికి వస్తే ప్రభుత్వ, పరిషత్ పాఠశాల సంఖ్య విషయంలో 1,065 స్కూళ్లతో రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచింది. మరోవైపు ఆరు నుంచి ఇంటర్ వరకు విద్యను అందించే మోడల్ స్కూల్, మదర్సా, నేషనల్ చైల్డ్ లేబర్ ప్రాజెక్టు స్కూల్స్ జిల్లాలో ఒక్కటి కూడా లేవు.
- జిల్లా వ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డుల సంఖ్య 2,74,496గా ఉంది. ఇవి కాకుండా అంత్యోదయ కార్డులు 18,801, అన్నపూర్ణ కార్డులు 3గా ఉన్నాయి. ఇక చౌక ధరల దుకాణాల సంఖ్య 442గా ఉంది.
- 2021లో జనగణన జరగకపోవడతో లింగ నిష్పత్తి, పట్టణీకరణ, అక్షరాస్యత, శిశుమరణాల రేటు వంటి కీలక అంశాలకు సంబంధించిన తాజా డేటా అందుబాటులో లేదు. ఇప్పటికీ 2011 జనాభా లెక్కలనే ప్రమాణికంగా ఈ సర్వేలో తీసుకున్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని సెలవుగా ప్రకటించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల వినతి

మణుగూరు టౌన్: ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ శుక్రవారం ఆదివాసీ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. సీఎంకు వినతిపత్రం అందజేసిన వారిలో మంత్రి ధనసరి అనసూయ, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం, ఇల్లెందు ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

గోదావరి దోబూచులాట..

- పది రోజులుగా తగ్గుతూ, పెరుగుతూ హైరానా..
- ఆందోళన చెందుతున్న ముంపు ప్రాంత ప్రజలు
- రామాలయానికి తగ్గిన భక్తుల సంఖ్య



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహ ఉధృతి

భద్రాచలం: భద్రాచలం ఏజెన్సీ ప్రజలను గోదావరి నది ముప్పు తిప్పలు పెడుతోంది. పది రోజుల నుంచి 40 అడుగులకు పైగా వరద ఉధృతి కొనసాగుతోంది. తగ్గుతూ, పెరుగుతూ ప్రవహిస్తోంది. 2022 జూలై నెలలో 71.6 అడుగులకు వచ్చిన కేవలం మూడు రోజులలోనే పూర్తిగా తగ్గిపోయింది. కానీ ఈ ఏడాది గోదావరి ముంపు ప్రాంత ప్రజలకు, అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

మూడోసారి రెండో ప్రమాద హెచ్చరిక

భద్రాచలం వద్ద గోదావరి శుక్రవారం రాత్రి 9.15 గంటలకు 48 అడుగులు దాటడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కేవలం వారం రోజుల వ్యవధిలోనే 48 అడుగులను దాటి ప్రవహించటం ఇది మూడోసారి. గత ఆదివారం, గురు, శుక్రవారాలలో తగ్గినట్టే తగ్గి గోదావరి మళ్లీ పెరిగింది. ఎగువన ఉన్న కాళేశ్వరం, సమ్మక్క బ్యారేజీలకు భారీగా వరద నీరు వస్తుండటంతో భద్రాచలం వద్ద నీటి మట్టం పెరుగుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు. తాలిపేరుకు వరద తగ్గడంతోపాటు దిగువన ఉన్న శబరి వరద పోటు తగ్గిందని, దీంతో తీవ్ర ప్రమాదమేమి లేదని అభిప్రాయపడుతున్నారు. అయినా ప్రవాహంలో హెచ్చు తగ్గులుగా ఉండటంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. పునరావాస శిబిరాలను కొనసాగించాలని తెలిపారు. కాగా రాత్రి 11 గంటలకు 48.40 అడుగులు నమోదు కాగా 11,63,596 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది.

తగ్గిన భక్తుల రాక

భారీ వర్షాలతో భద్రాచలంలో ఉన్న శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి భక్తుల రాక భారీగా తగ్గింది. సెలవు రోజులతో పాటు వారాంతపు సెలవుదినాలలో ఐదు వేల నుంచి పది వేల వరకు భక్తులు వచ్చేవారు. గత పదిరోజుల నుంచి రోజుకు 2 వేలకు మించి రావడంలేదని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. గోదావరి వద్దకు భక్తులను అనుమతించకపోవడంతో పితృకార్యాలు, గంగ పూజలు చేసే అర్చకులు ఉపాధి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక భద్రాచలంలోని లాడ్జీలు, సత్రాలు, రెస్టారెంట్‌లు, బొమ్మల దుకాణాలతో పాటు అన్ని వ్యాపార సముదాయాలు బోసిపోయి దర్శనమిస్తున్నాయి.

తాలిపేరుకు కొనసాగుతున్న వరద ఉధృతి

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టులో వరదనీరు వచ్చి చేరుతుండగా, శుక్రవారం 10 గేట్లను ఎత్తి ఉంచి 11,998 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, ఎగువ నుంచి వస్తున్న వరదనీటిని దృష్టిలో ఉంచుకొని నీటిమట్టాన్ని 71.40 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు.

గుణాత్మక విద్యనందించాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

గుండాల: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సరైన మెనూతోపాటు, గుణాత్మక విద్యనందించాలని, అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఆయన కాచనపల్లి క్రీడా బాలికల పాఠశాల, అనంతోగు బాలికల ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. క్రీడా సాధన చేస్తున్న విద్యార్థులతో ముచ్చటించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించేలా తీర్చిదిద్దాలని కోచ్‌లకు సూచించారు. అనంతరం ఆళ్లపల్లి మండలం అనంతోగు బాలికల ఆశ్రమ పాఠశాలలో తరగతి గదులు, కిచెన్‌షెడ్డు, డార్మెటరీ, డైనింగ్ హాలు పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందడం లేదని పీఓ దృష్టికి రాగా, హెచ్‌ఎం భావ్‌సింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డీడీని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



అనంతోగు పాఠశాలలో విద్యార్థిని ప్రతిభను పరీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్

ఉద్యానవన పంటలు సాగుచేయాలి

దుమ్ముగూడెం: రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తూ జీవనోపాధి పెంపొందించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఎస్.లక్ష్మీపురం గ్రామంలో గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయ పథకం అమలుతీరును, గోశాల, జీవామృత ఫారమ్, జీపీఎస్ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేస్తే భూసారం కోల్పోదని అన్నారు. గోవుల పేడతో జీవామృతం, ఘనామృతం తయారు చేసుకుని పంటలకు ఎరువుగా ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతు ఎర్రం సత్తిబాబును అభినందించారు. అనంతరం చేపల చెరువును పరిశీలించి ప్రమాదకరమైన వ్యర్థాలను వేసి చేపల పెంపకం చేపట్టొద్దన్నారు. గోదావరి వరదలతో కూలిపోయిన సింగారం బ్రిడ్జి నిర్మాణం త్వరలో పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో అగ్రికల్చర్ ఏడీ భాస్కర్, ఉద్యానవన అధికారి/ఏటీడీఓ అశోక్, సెర్ప్ ఏపీఎం హేమంతిని, క్రీడల అధికారి గోపాలరావు, హెచ్‌ఎం శారద, కోచ్‌లు గొంది మరెప్ప, నాగరాజు, రవి పాల్గొన్నారు.

అధిక వర్షాలతో ఆందోళన

- ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 395.2 మి.మీ
- జిల్లావ్యాప్తంగా 623 మి.మీ నమోదైన నగటు వర్షపాతం
- 17 మండలాల్లో ఎక్కువ, ఆరు మండలాల్లో సాధారణం
- 426 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి కలెక్టర్ నివేదిక



నారాయణపురంలో కొట్టుకుపోయిన పొలాలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో అధికవర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సాధారణానికి మించి వర్షాలు కురిశాయి. ఆరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా 17 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో 363 మంది రైతులకు సంబంధించి 391 ఎకరాల్లో సాధారణ, 34 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. ప్రధానంగా గోదావరి పరీవాహక ప్రాంతంలో పంటలు నీట మునిగాయి. వివిధ ప్రాంతాల్లో ప్రాజెక్టుల ఆయకట్టు ప్రాంతాల్లో కూడా పంటలు నీట మునిగాయి. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నష్టం వివరాలను సేకరించారు. జిల్లాలో మొత్తం 383 మంది రైతులకు సంబంధించిన 426.17 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పంటనష్టంపై నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి పంపించారు. కాగా ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చిన విషయం విదితమే.

4,12,921 ఎకరాల్లో వానాకాలం సాగు..

వానాకాలం పంటల సాధారణ విస్తీర్ణం 4,71,622 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4,12,921 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం 88 శాతంగా నమోదైంది. వరి సాగు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. వరి సాధారణ విస్తీర్ణం 1,60,332 ఎకరాలు కాగా ఇప్పటిదాకా 14,568 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. చాలా చోట్ల వరినారు పోశారు. కురుస్తున్న వర్షాలతో నాట్లు వేసే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. పత్తి సాధారణ విస్తీర్ణం 1,56,212 ఎకరాలు కాగా అంచనాకు మించి 1,88,263 ఎకరాల్లో పంటలు వేశారు. పంట విస్తీర్ణం 121 శాతంగా నమోదైంది. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 41,503 ఎకరాలు కాగా ఇప్పటివరకు 55,820 ఎకరాల్లో పంట వేయగా, విస్తీర్ణం 134 శాతంగా నమోదైంది.

కొన్ని మండలాల్లో వర్షపాతం వివరాలు (మి.మీ.ల్లో)

మండలం	కురవాల్సిన వర్షం	కురిసిన వర్షం
పినపాక	426.9	961.0
చర్ల	486.0	1,062.6
మణుగూరు	443.4	937.2
టేకులపల్లి	355.6	390.2
లక్ష్మీదేవిపల్లి	372.1	364.2

సాధారణానికి మించి..

జిల్లాలో జూన్ నుంచి ఇప్పటివరకు 395.2 మి.మీ సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా 622.8 మి.మీ వర్షపాతం నమోదైంది. కరకగూడెం, పినపాక, చర్ల, దుమ్ముగూడెం, అశ్వాపురం, మణుగూరు, ఆళ్లపల్లి, గుండాల, జూలూరుపాడు, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, పాల్వంచ, బూర్గంపాడు, భద్రాచలం, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో అధికవర్షపాతం నమోదైంది. ఇల్లెందు, టేకులపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.

పంటలకు తెగుళ్లు వస్తాయి..



వర్షాలు పెరగడంతో వ్యవసాయ పనులు ముమ్మరం చేశాం. అయితే అధిక వర్షాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వర్షం తగ్గుముఖం పడితే బాగుంటుంది. లేకపోతే పంటలకు చీడపీడలు సోకుతాయి.

–ఈసం సత్యనారాయణ, రైతు, కరకగూడెం మండలం

వానాకాలం సాగు 88 శాతం



భారీ వర్షాలతో జిల్లాలో కొన్నిచోట్ల పంట నష్టం జరుగుతోంది. నష్టంపై సర్వే చేస్తున్నాం. ఇప్పటికే వానాకాలం సాగు 88 శాతం పూర్తయింది. పంటలు నష్టపోకుండా రైతులు వ్యవసాయాధికారుల సూచనలను పాటించాలి.

– బి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

■ లక్ష పసుపు కొమ్ములతో అలంకరణ



ఆషాఢమాసం సందర్భంగా గుర్రాల చెరువు గ్రామ సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని శుక్రవారం లక్ష పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. 108 మంది మహిళలు కుంకుమార్చన తదితర పూజలు జరిపారు. అన్నసమారాధన నిర్వహించారు.

–అశ్వారావుపేటరూరల్

29న నిధి ఆప్‌కే నిఖత్

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న 'నిధి అప్ కే నిఖత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ రీజినల్ కమిషనర్ కె.సునీల్ ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థల యజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు పెన్షనర్లు ఈపీఎఫ్ఓ ఆధ్వర్యాన జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని వెల్లడించారు. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి సర్వారాయ షుగర్స్ లిమిటెడ్‌లో, భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

పెదవాగు రింగ్‌బండ్ నిర్మాణానికి భూమిపూజ

అశ్వారావుపేటరూరల్: పెదవాగు ప్రాజెక్ట్ వద్ద తాత్కాలిక రింగ్‌బండ్ నిర్మాణానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గుమ్మడవల్లి వద్ద పెదవాగు ప్రాజెక్టుకు రింగ్ బండ్ నిర్మాణానికి, బచ్చువారిగూడెం చెరువు గండి పూడ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నీటి పారుదల శాఖ ద్వారా రూ.3.50 కోట్లు కేటాయించిందని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి తెలంగాణ రాష్ట్ర పరిధిని సుమారు 2600 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, ఐబీ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ సురేష్ కుమార్, డీఈఈ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, బండి చెన్నారెడ్డి, ఆకుల శ్రీను, ఎస్‌కే బాబా పాల్గొన్నారు.

క్లుప్తంగా

3 నుంచి శ్రావణ మాసోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో వచ్చే నెల 3 నుంచి సెప్టెంబర్ 3వరకు శ్రావణమాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎల్.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు 3 నుంచి 7 వరకు శ్రీఆండాల్ అమ్మవారి తిరుకల్యాణ మహోత్సవాలు, 14 నుంచి 19 వరకు ప్రతిరోజు ప్రత్యేక పూజలు ఉంటాయని వెల్లడించారు. కాగా, శ్రావణమాసంలో మొదటి శుక్రవారం లక్ష్మి అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, రెండు, మూడో శుక్రవారాలు సాయంత్రం సామూహిక హోమాలు, నాలుగో శుక్రవారం పుష్పాంజలి సేవలు నిర్వహిస్తామని వివరించారు.

28న శాకాంబరిగా అమ్మవారు

పాల్వంచ: ఆషాఢమాసం సందర్భంగా ఈ నెల 28న పెద్దమ్మతల్లి అమ్మవారిని రకరకాల పండ్లు, కూరగాయలతో శ్రీ శాకాంబరిదేవి రూపంలో అలంకరిస్తామని ఈఓ రజినికుమారి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాలలో రెగ్యులర్ బీఎడ్ కోర్సులో (2024–26 విద్యాసంవత్సరం) ప్రవేశం కోసం గిరిజన పట్టభద్రుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తెలంగాణకు చెందిన గిరిజన పట్టభద్రులై ఉండాలని, డిగ్రీ పాసై కనీసం 40 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత డిగ్రీ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని, ప్రభుత్వ నియమాల ప్రకారం మహిళలకు ప్రత్యేక కేటగిరీ సీట్లు రిజర్వ్ చేశారని తెలిపారు. పూర్తి వివరాల కోసం 89784 77345 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జెడ్పీలో జీపీఎఫ్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల జీపీఎఫ్ (భవిష్య నిధి విభాగం) కార్యాలయాన్ని శుక్రవారం జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.చంద్రశేఖర్, జిల్లా పరిషత్ జీపీఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రసాద్, కార్యాలయం సిబ్బంది, టేకులపల్లి, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండల పరిషత్ అభివృద్ధి పాల్గొన్నారు.

అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అనిల్‌కుమార్



అనిల్‌కుమార్

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నర్సింగ్ అనిల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఖమ్మం రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నుంచి కొత్తగూడెంనకు బదిలీపై వచ్చారు.

లారీ ఢీకొని మేకలు మృతి

దమ్మపేట: లారీ ఢీకొని 12 మేకలు మృతిచెందిన ఘటన మండలంలోని మందలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన మీగడ వెంకటేశ్వరరావు తన మేకలను అదే గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు దాటిస్తున్నాడు. అశ్వారావుపేట వైపు నుంచి సత్తుపల్లి వైపు అతివేగంతో ప్రయాణిస్తున్న లారీ మేకలను ఢీకొట్టడంతో 12 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. లారీ ఆగకుండా వెళ్లిపోయింది. మృతి చెందిన మేకల విలువ రూ.1,20,000 ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశానని బాధితుడు తెలిపాడు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: భార్య కాపురానికి రావడం లేదని, మద్యం మత్తులో ఉరి వేసుకొని భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రిచోటుచేసుకుంది. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని పాత నారంవారిగూడేనికి చెందిన గుల్ల లక్ష్మణ్‌రావు (25)కు వినాయకపురానికి చెందిన సుధారాణితో ఏడేళ్ల కిందట వివాహమైంది. ఆరేళ్ల కుమార్తె, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. కాగా, దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండగా, ఏడాది కిందట సుధారాణి ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. లక్ష్మణ్‌రావు ఒంటరిగా ఉంటూ, కూలీ పనులకు వెళ్తున్నాడు. మద్యం మత్తులో భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం తెల్లవారినా బయటకు రాకపోవడంతో, ఇతని స్నేహితుడు కూలీ పనులకు తీసుకెళ్లేందుకు వచ్చి చూసే సరికి ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. మృతుడి సోదరుడు నాగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కష్టాలు మోసుకొస్తున్న వాన..

వరద నీటితో జలదిగ్బంధంలో భద్రాచలం

- స్లూయిజ్‌ల లీకేజీతో ఆలయ పరిసరాలు మునక
- ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థపై ముందడుగేది..?
- ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకోవాలని వేడుకోలు



చర్ల రోడ్డులో వారం క్రితం రోడ్డుపైకి చేరిన వర్షపు నీరు (ఫైల్)

భద్రాచలం: చినుకు పడితే భద్రాచలం వణికిపోతోంది. కొద్దిపాటి వర్షం కురిసినా పట్టణ రహదారులన్నీ వరద నీటితో నిండిపోయి రాకపోకలు స్తంభించిపోతున్నాయి. గతంలో కేవలం గోదావరి వరద ముంపునకే భయపడే స్థానికులు, ప్రస్తుతం వర్షం కురిస్తే రోడ్డు మీదకు రావాలంటే జంకుతున్నారు. మరో వైపు స్లూయిజ్‌ల లీకేజీ ఎప్పటిలాగే భయపెడుతోంది. తాత్కాలిక మరమ్మతులు, మోటార్ల సంఖ్య పెంచటం తప్ప వాటికి శాశ్వత పరిష్కారం చూపటంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటన్నింటికి నివారణగా భద్రాచలంలో 'ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థ'కు రూపకల్పన చేసి అమలు పర్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చినుకుపడితే రోడ్లన్నీ మునకే

సుమారు లక్ష జనాభా ఉన్న భద్రాచలంలో భూవిస్తీర్ణం తగ్గుతోంది. భద్రాచలం పట్టణం మినహా ఇతర గ్రామాలన్నీ ఆంధ్ర ప్రదేశ్‌లో కలపటంతో ఈ సమస్య మరింత జఠిలంగా మారింది. దీంతో ఇండ్లు, వ్యాపారాల అవసరాలకు భూమి డిమాండ్ పెరగటంతో పాటు ప్రభుత్వ స్థలాల కబ్జాలు తీవ్రంగా పెరిగాయి. డ్రెయినేజీల నిర్మాణాలకు సైతం స్థలం దొరకని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో చిన్నపాటి వర్షం కురిసినా ఆ వరద నీరు పోయేందుకు దారి లేక రోడ్లపైనే నిలవటంతో పాటుగా పరిసర కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరుతోంది. మోకాళ్ల లోతుకు పైగా నీరు నిలుస్తోంది. పట్టణంలోని రాజుపేట ప్రాంతంలోని ప్రధాన రహదారి, అటవీశాఖ కార్యాలయం, పలుకాలనీల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడమే అందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థకు ప్రణాళికలేవి?

గోదావరి, వర్షాలతో వచ్చే వరద నుంచి భద్రాచలాన్ని కాపాడేందుకు అధికారులు, ప్రభుత్వం ఇప్పటి వరకు శాశ్వత ప్రణాళిక రూపొందించకపోవడం శోచనీయం. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు స్లూయిజ్‌ల వద్ద మోటార్లు ఏర్పాటు చేసి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తున్నారు. కీలక సమయంలో సైతం ఆ మోటార్లు మొరాయిస్తు అధికారులను, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. భద్రాచలంలోని వర్షపు నీటితో పాటుగా మురుగు నీటిని తోడేందుకు కరకట్టకు రెండు వైపులా ముంపునకు గురి కాని ఎత్తులో ఎత్తిపోతల వ్యవస్థను చేపట్టాలని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా అండర్ డ్రెయినేజీ వ్యవస్థను రూపొందించి అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రామాలయం వద్ద షరామామూలే..

ఇక గోదావరి వరద పెరుగుతుందంటే రామాలయం చుట్టు పక్కల, లోతట్టు కాలనీ వాసులు, విస్తా కాంప్లెక్స్ వ్యాపారులు బిక్కుబిక్కుమంటూ గడపటం షరామామూలుగా మారింది. గోదావరి వరద పెరుగుతుందంటూ కరకట్టల వద్ద ఏర్పాటు చేసిన స్లూయిజ్‌లను మూసివేయటంతో ఈ దుస్థితి నెలకొంటోంది. ఇక భారీగా గోదావరికి వరద నీరు చేరుకుందంటే వీరి బాధలు వర్ణణాతీతం. రాత్రికి రాత్రే ఇళ్లను ఖాళీ చేసి పునరావాస శిబిరాలకు తరలివెళ్తుంటారు. గతంలో రామాలయం అన్నదాన సత్రం వద్ద ఓ మహిళా కానిస్టేబుల్ డ్రెయినేజీలో మునిగి చనిపోయిన విషయం విదితమే. అయినా అధికారులు, పాలకులు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.



స్లూయిజ్‌ల లీకేజీతో రామాలయం వద్ద రామదాసు విగ్రహం వద్దకు చేరుకున్న నీరు (ఫైల్)

ప్రభుత్వానికి నివేదిస్తా..

భద్రాచలం జనాభాకు అనుగుణంగా ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదిస్తా. భద్రాచలానికి వచ్చే గోదావరి వరదలు, వర్షపు నీరు పోయేందుకు ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థ చాలా అవసరం. ఆ దిశగా ప్రణాళికలను రూపొందించి అమలుపర్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా. ప్రభుత్వ స్థలాల ఆక్రమణతో భద్రాచలంలో కొన్నికాలనీల్లో ఈ సమస్య తలెత్తుతోందనే సమాచారం ఉంది. ఆక్రమణలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– తెల్లం వెంకట్రావ్, ఎమ్మెల్యే, భద్రాచలం

'నాస్'లో విద్యార్థులు సత్తా చాటాలి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరచారి

కొత్తగూడెంఅర్బన్: నవంబర్‌లో జరగబోయే జాతీయ సాధన సర్వే (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)లో జిల్లా విద్యార్థులు సత్తా చాటాలని డీఈఓ వెంకటేశ్వరచారి ఆకాంక్షించారు. శుక్రవారం పాత కొత్తగూడెంలోని ఆనందఖని పాఠశాలలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన తెలుగు, ఆంగ్లం, గణితం రిసోర్స్ పర్సన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా డీఈఓ హాజరై ప్రసంగించారు. జిల్లాలో 2021లో నిర్వహించిన జాతీయ సాధన సర్వేలో రాష్ట్రంలో ఈ జిల్లా 25వ స్థానంలో నిలిచిందని, ఈ సంవత్సరం జరగబోయే సర్వేలో జిల్లాను మొదటి పది స్థానాల్లో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం సమగ్ర శిక్ష ఫైనాన్స్ అధికారి యస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రిసోర్స్ పర్సన్లు వారి శక్తి సామర్థ్యాల మేరకు ఉపాధ్యాయులకు సహకారం అందించాలని, విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ వ్యవహరించగా, రిసోర్స్ పర్సన్లుగా ఈమెల్యా, రవిప్రతాప్, మీరాహుస్సేన్, నాగేశ్వరరావు, హరిపిచ్చారావ్, కాసీంపాషా, విష్ణుప్రియ, రాజశేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

బాధితులకు భరోసా కల్పించాలి

ఎస్పీ రోహిత్‌రాజు



ఎస్సై శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

పాల్వంచ: సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూరుతుందనే భరోసా కల్పించాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కిన్నెరసానిలోని రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి, కేఎస్సై శ్రీనివాస్‌తో మాట్లాడి కేసుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ డయల్ 100 ఫోన్ రాగానే స్పందించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నివారణకు అవగాహన కల్పించాలని చెప్పారు. మావోయిస్ట్‌ల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రహిత జిల్లాగా మారుద్దాం..

కొత్తగూడెంటౌన్: భద్రాద్రిని గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ రోహిత్‌రాజు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై యువకులు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లాలో ఎవరైనా గంజాయిని సేవించినా, అమ్మినా, రవాణా చేసినా 87126 82133, 87126 82135 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఇప్పటికే అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో యువకులు గంజాయిని సేవించే స్థలాలను గుర్తించామని, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు.

పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని ఆందోళన

పిల్లలతో కలిసి తండ్రి రాస్తారోకో



నిరసన తెలుపుతున్న పాపారావు, చిన్నారులు

ములకలపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న తమ పిల్లలకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని చిన్నారులతో కలిసి తండ్రి రోడ్డుపై ధర్నా చేశారు. మండలంలోని తాళ్లపాయ గ్రామానికి చెందిన పాపారావు తన ఇద్దరు కుమారులు జాయ్ (7వ తరగతి), సిద్దు (6వ తరగతి)ను ములకలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించాడు. వారు స్థానిక ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ స్కూల్‌కు వెళ్తున్నారు. కానీ, వారికి పాఠ్య పుస్తకాలు ఇవ్వకపోవడంతో తండ్రి పాపారావు పిల్లలతో కలిసి ముకలపల్లి బస్టాండ్ సెంటర్లో రోడ్డుపై బైఠాయించారు. పుస్తకాల కోసం ఉపాధ్యాయులను అడిగినా పట్టించుకోలేదని వాపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హెచ్‌ఎంకు సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి విద్యార్థులు, తండ్రి పాపారావుతో మాట్లాడారు. పాత పుస్తకాలు సర్దుబాటు చేస్తామని, తిరిగి పుస్తకాలు రాగానే ఏర్పాటు చేస్తామని చెప్పి, విద్యార్థులను స్కూల్‌కు తీసుకెళ్లారు.

30 ద్విచక్రవాహనాలు సీజ్

జూలూరుపాడు: ఆర్‌సీ బుక్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్, నంబర్ ప్లేట్లు లేని 30 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు జూలూరుపాడు ఎస్‌ఐ బి.రాణాప్రతాప్ చెప్పారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ, స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశామని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించామని ఎస్‌ఐ చెప్పారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, మల్లయ్య, కానిస్టేబుళ్లు రామకృష్ణ, కోటేశ్వరరావు, సురేశ్, కుటుంబరావు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో పశువుల మృతి



కేటీపీఎస్ బంకర్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు, గ్రామస్తులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు బంకర్ సమీపంలో పశువులు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. కిష్టారంవాసులకు చెందిన ఆవులు, ఎద్దులు, మేకలు రోజూ కేటీపీఎస్ బంకర్ సమీపంలో మేతకు వెళ్తుంటాయి. గురువారం కూడా మేతకు వెళ్లి రాత్రి ఇంటికి తీసుకెళ్తున్న సమయంలో జబ్బ నర్సయ్యకు చెందిన రెండు ఆవులు, చింత కన్నయ్యకు చెందిన ఒక ఆవు, మాడె భద్రానికి చెందిన రెండు మేకలు, కొర్స వీరస్వామికి చెందిన రెండు మేకలు మృతి చెందాయి. కేటీపీఎస్ అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోకపోవడంతో శుక్రవారం పశువుల కళేబరాలతో బంకర్ వద్ద కార్యాలయం ఎదుట బాధితులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ నేత కోరం సురేందర్, సీపీఎం నేతలు రేపాకుల శ్రీనివాస్, ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, కిష్టారం గ్రామ పెద్దలు అధికారులతో చర్చలు జరిపారు. మానవతా దృక్పథంతో నష్టపరిహారం ఇచ్చేందుకు సింగరేణి అధికారులు అంగీకరించారు. ఉద్యోగం విషయాన్ని పరిశీలిస్తామని చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు.

అమరుల త్యాగం వృథా కాదు

మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ

చర్ల: పీడిత ప్రజల విముక్తి కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగం వృథా కాదని, వారి ఆశయాలను, ఆదర్శాలను విప్లవత్యాగాలను ఎత్తిపడదామని మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఈ మేరకు తెలంగాణా రాష్ట్ర కమిటీ పేరిట మండలంలోని సత్యనారాయణపురం, ఆర్.కొత్తగూడెం శివారు ప్రాంతాల్లో వాల్‌పోస్టర్లు వెలిశాయి. 2024 జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారాన్ని జరపాలని, ప్రజలపై, మావోయిస్టు పార్టీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న విప్లవ ప్రతిఘాతుక యుద్ధం ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకించాలని, సామ్రాజ్యవాదులకు, దళారీదోపిడీ వర్గాలకు సేవ చేస్తూ పేద ప్రజల సంక్షేమాన్ని మరచిన బ్రాహ్మణీయ, హిందుత్వ, ఫాసిస్ట్ బీజేపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణా రాష్ట్ర కమిటీ వాల్‌పోస్టర్లలో కోరింది.

డెంగీతో యువకుడు మృతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఓ యువకుడు డెంగీ జ్వరంతో మృతి చెందాడు. వైద్యుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపురం మండలం రాచపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ (31) వారం రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతూ అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం వెంకటేశ్‌ను కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లలిత, నలుగురు సంతానం ఉన్నారు.

గాయపడిన యువకుడు..



కర్రి ప్రవీణ్ (ఫైల్)

అశ్వాపురం: మండలంలోని నెల్లిపాకబంజర గ్రామానికి చెందిన యువకుడు నాలుగు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి శుక్రవారం మృతి చెందాడు. ఐటీసీలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తున్న నెల్లిపాకబంజర గ్రామానికి చెందిన కర్రి ప్రవీణ్ (23) నాలుగు నెలల కిందట ఐటీసీలో విధులు ముగించుకొని సారపాక నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా రామచంద్రాపురం స్టేజీ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలవగా హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. వైద్యం కోసం గ్రామస్తులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, ఐటీసీ వారు సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు పెట్టారు. నాలుగు రోజుల కిందట ఇంటికి తీసుకొచ్చారు. శుక్రవారం మృతి చెందాడు.

గుండెపోటుతో లారీడ్రైవర్..

కొత్తగూడెంటౌన్: జీవనోపాధి కోసం వారం రోజుల కిందట ఇంటి నుంచి వచ్చిన లారీడ్రైవర్.. లారీలోనే గుండెపోటుతో మృతిచెందిన విషాదకర ఘటన శుక్రవారం స్థానిక 5 ఇంక్లైన్ బొగ్గులోడింగ్ పాయింట్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ వైఎస్సార్‌కాలనీకి చెందిన లారీడ్రైవర్ దిడ్ల జేమ్స్ (59) వారం కిందట బొగ్గు లోడు కోసం రుద్రంపూర్‌లోని 5 ఇంక్లైన్ బొగ్గు లోడింగ్ పాయింట్‌కు చేరుకున్నారు. మరోడ్రైవర్ ఎంత పిలిచినా పలకలేదు. మిగతావారికి సమాచారం ఇచ్చి అక్కడి వెళ్లి చూడటంతో మృతిచెంది ఉన్నాడు. టూటౌన్ పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య శారద, కుమారుడు ఉన్నారు. మృతుడి బావమరిది సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. కాగా, వారం రోజులుగా ఎంతో సరదాగా తమతో గడిపిన జేమ్స్ ఒక్కసారిగా మృతిచెందడం బాధగా ఉందని తోటి డ్రైవర్లు కన్నీటి పర్యంతమయ్యారు.

సొంత లారీని చోరీ చేసిన ఓనర్!



వివరాలు వెల్లడిస్తున్న సీఐ టి.సురేశ్

టేకులపల్లి: అప్పులపాలైన లారీ యజమాని.. లారీ రుణం ఎగ్గొట్టేందుకు తన లారీని తానే చోరీ చేసి, పోలీసుల దర్యాప్తులో దొరికిపోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. సీఐ టి.సురేశ్, బోడు ఎస్‌ఐ పి.శ్రీకాంత్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఇల్లెందుకు చెందిన ఖాజా సలీముద్దీన్ కొన్నేళ్లుగా లారీ నడుపుతూ జీవిస్తున్నాడు. గతేడాది జనవరిలో చోల మండలం ఫైనాన్స్ కంపెనీ వద్ద రూ.8 లక్షలు రుణం తీసుకుని ఏపీ20 టీబీ 9008 నంబర్ గల లారీని కొనుగోలు చేశాడు. లారీ అసోసియేషన్‌లో పేరు నమోదు చేసుకుని బొగ్గు రవాణాకు లారీని వినియోగిస్తున్నాడు. ఈ నెల 8న బొగ్గు లోడింగ్ కోసం కేటీపీఎస్‌కి వెళ్లాడు. లోడింగ్ సీరియల్ లేకపోవడంతో లారీని యార్డులోనే ఉంచి వెళ్లిపోయాడు. పదో తేదీన లారీ కనిపించలేదని, తన లారీని ఎవరో చోరీ చేశారని 12వ తేదీన బోడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

తుక్కు కింద విక్రయించి..

లారీకి సరైన కిరాయిలు లేకపోవడంతో వాయిదాలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. లారీ చోరీకి గురైందని అందరినీ నమ్మిస్తే ఫైనాన్స్ వారు ఇన్సూరెన్స్ ద్వారా డబ్బులు జమ చేసుకుంటారని, తనకు అప్పు కట్టాల్సిన అవసరం ఉండదని, లారీని స్క్రాప్ కింద అమ్ముకుంటే వచ్చే డబ్బులు ఖర్చులకు ఉపయోగపడతాయని సలీముద్దీన్ ఆలోచించాడు. ఈ నెల పదో తేదీ లోపే లారీని టోల్‌ప్లాజాలకు దొరక్కుండా విజయవాడ ఆటోనగర్‌కు వెళ్లి అక్కడ వ్యాపారికి తుక్కు కింద అమ్ముకున్నాడు. ఫైనాన్స్ కంపెనీని, తప్పుడు సమాచారం ఇచ్చి పోలీసులను మోసగించినందుకు సదరు నిందితుడిపై కేసు నమోదు చేశామని, లారీని స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పాల్వంచ: తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసి, చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. శుక్రవారం సీఐ వినయ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శాస్త్రీరోడ్‌లో పట్టణ ఎస్‌ఐ రాఘవయ్య అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతను విజయవాడ వాంబేకాలనీకి చెందిన చింతల దుర్గాప్రసాద్ అని, పాల్వంచలో గతంలో జరిగిన పలు చోరీల్లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఇతను శివనగర్, కాంట్రాక్టర్స్‌కాలనీ, అయ్యప్పనగర్‌లలో మూడు చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడని, గతంలో చోరీ కేసులో జైలుకు వెళ్లగా అక్కడ గుండాల మండలం మామకన్ను గ్రామానికి చెందిన సయ్యద్ అల్తాఫ్, పాల్వంచ వనమాకాలనీకి చెందిన అందూరి వీరందర్‌తో పరిచయం ఏర్పడిందని, అప్పటి నుంచి వారు పగలు రెక్కీ చేసి, రాత్రి చోరీలకు పాల్పడేవారని చెప్పారు. ఇప్పటికే వనమాకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ వీరేందర్, అల్తాఫ్ కోదాడలో పోలీసులకు పట్టుబడ్డాడు. దుర్గాప్రసాద్‌ను పాల్వంచ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 55.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 కేజీల 155 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ఖమ్మం, భీమవరంలో కూడా దొంగతనాలకు పాల్పడ్డాడని, ఆ కేసుల్లో 71 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఆయన వెల్లడించారు.

కోడి పందేలస్థావరంపై దాడి

ములకలపల్లి: గుట్టు చప్పుడు కాకుండా కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌హెచ్‌ఓ రామారావు కథనం మేరకు.. మండలంలోని మాధారం అటవీ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో దాడులు నిర్వహించి, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మూడు కోడి పుంజులు, రూ.2 వేలు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

అన్నపురెడ్డిపల్లి: నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్థానిక పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఓ దుకాణంలో నిల్వ చేసిన రూ.1,300 విలువ చేసే గుట్కా ప్యాకెట్లను ఏఎస్‌ఐ ప్రసాద్ స్వాధీనం చేసుకున్నారు. యజమానిపై ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.

కులం పేరుతో దూషించినట్లు ప్రచారం

ములకలపల్లి: మండలంలోని సీతారాంపురం శివారు సోయంగంగులునగర్‌లోని పూరిగుడిసెల్లో నివసిస్తున్న గిరిజన మహిళలను ఓ వ్యక్తి కులంపేరుతో దూషించారంటూ శుక్రవారం వాట్సాప్ వేదికగా ప్రచారం జరిగింది. బాధిత మహిళల కథనం మేరకు.. గురువారం సాయంత్రం కొందరు వ్యక్తులు సోయంగంగులునగర్‌కు వచ్చి తమను ఫొటోలు, వీడియోలు తీశారని, ఈ భూమి తమకే చెందుతుందని, కులం పేరుతో దూషిస్తూ, గుడిసెలు ఖాళీ చేయాలని బెదిరించారని ఆరోపించారు. ఖాళీ చేయకపోతే కేసులు పెట్టిస్తామని భయభ్రాంతులకు గురిచేశారని వాపోయారు. న్యాయం చేయాలని బాధిత మహిళలు తానం లక్ష్మి, సునీత, సోయం గంగులునగర్ గ్రామ ఆదివాసీ మహిళలు ములకలపల్లి పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ విషయమై ఎస్‌ఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని తెలిపారు.